సాక్షి వరంగల్

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



వరంగల్ చాంబర్‌కు ప్రత్యేక గుర్తింపు

వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీకి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸



శంషాబాద్ విమానాశ్రయానికి ఆర్టీసీ బస్సు

హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆర్‌ఎం శ్రీలత తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32⁰ /24⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురుస్తాయి. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టీవీ అశోక్‌కుమార్‌కు అవార్డు ప్రదానం



కాశీజీ సెంటర్ : అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం వరల్డ్ టీచర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు టీవీ అశోక్‌కుమార్‌కు గురుబ్రహ్మ ఎక్స్‌లెన్సీ అవార్డు లభించింది. ఈమేరకు హైదరాబాద్‌లోని సమతా గోపాల నిలయంలో అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ జి.శ్రీధర్‌బాబు, డాక్టర్ సీహెచ్.వెంకటాచారి, జయప్రకాష్‌నాయర్, డాక్టర్ పి.త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు,

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన సర్వాపురం శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఖానాపురం మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన మజ్జిక విజయ్‌కుమార్ తన ద్విచక్రవాహనంపై అదే గ్రామానికి చెందిన నంద రాధిక, పార్థును తీసుకుని నర్సంపేట నుంచి కొత్తూరుకు వెళ్తున్నాడు. సర్వాపురం గ్రామ శివారులోని నాగమయ్య గుడిక్రాస్ 365 జాతీయ రహదారిపై మహబూబాబాద్ నుంచి కాళేశ్వరం వెళ్తున్న ఇసుక లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో విజయ్‌కుమార్ రెండు కాళ్లు విరిగాయి. రాధిక తలకు తీవ్రగాయాలు, పార్థుకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించి వైద్యులు వరంగల్‌కు రెఫర్ చేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



నర్సంపేట : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రూల్స్ అండ్ రెగులేషన్స్ కమిటీ కన్వీనర్, టార్గెట్ బాల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా చైర్మన్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు షిరిడీలో సోమవారం నుంచి జరగనున్న నాలుగో జాతీయస్థాయి టార్గెట్‌బాల్ సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొనడానికి నర్సంపేట నుంచి వెళ్తున్న క్రీడాకారులను ఆదివారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో టార్గెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాయిడి దుశ్యంత్‌రెడ్డి, జిల్లా సలహాదారులు గూడెపు భిక్షపతి, గుండేటి రవీందర్, సోనబోయిన సారంగపాణి, దేవీలాల్, చెన్నబోయిన రామదాస్, గుగులోతు భిక్షపతి, అసోసియేషన్ జిల్లా సెక్రటరీ యాట రవికుమార్, సభ్యులు ఓరుగంటి మహేష్, ఈక కృష్ణ, ఉడతల శ్రీకాంత్, పరికి శ్రీకాంత్, వజ్జ రాజేష్, ఉరుసుల శేఖర్, దొడ్డ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విద్యార్థులు



గీసుకొండ : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని కేయూ పీజీ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు ఫీల్డ్ స్టడీలో భాగంగా ఆదివారం సందర్శించారు. పలు కమిటీల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో గ్రామం ఆదర్శంగా నిలిచిన తీరును వారికి సర్పంచ్ గోనె మల్లారెడ్డి వివరించారు. కేయూ ప్రొఫెసర్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామాన్ని సందర్శించారు. ప్రాజెక్టు స్టడీ కోసం వివరాలు సేకరించారు.

ఫార్మసిస్టులకు గుర్తింపునివ్వాలి

నయీంనగర్ : తెలంగాణ ప్రభుత్వం ఫార్మసిస్టులకు ఫార్మసీ అధికారి (డాక్టర్)గా గుర్తింపు నివ్వాలని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందకట్ల శరత్‌బాబు ఒక ప్రకటనలో కోరారు. ఫార్మసిస్టు లేనిది ఔషధమే లేదని, ఔషధాలు ఉన్న చోట ఫార్మసిస్టు ఉండాలని చట్టాలు చెబుతున్నా ప్రభుత్వాలు వాటిని తుంగలో తొక్కుతున్నాయన్నారు. ఫార్మసిస్టులు ఔషధాలు కనుక్కోకుంటే వైద్య వ్యవస్థే లేదన్నారు. కొత్త వ్యాధుల నివారణకు పరిశోధనలు చేసి ఔషధాలు కనిపెట్టడంలో ఫార్మసిస్టుల కృషి వెలకట్టలేనిదన్నారు.

ఉమ్మడి జిల్లాకు తలమానికం

- గట్టమ్మ వద్ద గిరిజన యూనివర్సిటీ
- ఏర్పాటుకు ప్రకటన చేసిన ప్రధాని మోదీ
- దేశ నలుమూలల నుంచి రానున్న విద్యార్థులు
- అన్ని జాతులకు నిలయంగా మారనున్న గిరిజన ప్రాంతం



గిరిజన యూనివర్సిటీ కోసం కేటాయించిన స్థలం



బీజేపీ నాయకుల సంబురాలు

ములుగు: ఆదిలాబాద్.. మహబూబాబాద్‌లో ఏర్పాటు చేయాలని కొందరు.. కాదు కాదు ములుగులో అని మరికొందరు.. ములుగులో అయితే సరైన భూములు లేవు.. ఆదిలాబాద్‌లో అన్ని రకాల ఆదిమ, గోండు తెగలు ఉన్నాయంటూ గిరిజన యూనివర్సిటీపై 2016 నుంచి జరుగుతున్న చర్చకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. ములుగు జిల్లా కేంద్రం గట్టమ్మ గుడి వద్ద వనదేవతలు సమ్మక్క–సారలమ్మ పేరుమీద గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాకు ఈ వర్సిటీ తలమానికం కానుంది. సరైన ఆదాయ వనరులు లేని ఈ ప్రాంత అభివృద్ధికి వెంకటాపురం (ఎం) లోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయం, మేడారం సమ్మక్క–సారలమ్మ తల్లులు, బొగత, ముత్యంధార వంటి జలపాతాలకు గిరిజన వర్సిటీ తోడు కానుంది.

రయ్.. రయ్

గిరిజన యూనివర్సిటీ ప్రకటన రాకముందు నుంచి హైదరాబాద్–వరంగల్ ఆరెపల్లి వరకు ఔటర్ రింగ్ రోడ్డు.. ములుగు గట్టమ్మ వరకు జరుగుతున్న ఫోర్ లేన్ రోడ్డు.. దీనికి తోడు మామునూరుకు ఎయిర్ పోర్టు మంజూరు ఉమ్మడి జిల్లా అభివృద్ధికి దోహదపడనున్నాయి. అంతే కాకుండా ఢిల్లీ, మేఘాలయ, మణిపూర్ తదితర ప్రాంతాల నుంచి విమానాల్లో గంటల వ్యవధిలో చేరుకోవచ్చు. ఒకప్పుడు తినడానికి తిండి లేక కడుపు మాడ్చుకుని బతికిన వారి జీవితాలు ఆర్థికంగా బాగుపడనున్నాయి. స్థానిక యువతకు ఉపాధి కలుగనుంది. దీంతో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు.

ఖాళీ కానున్న ప్రేమ్‌నగర్

గిరిజన వర్సిటీ ఏర్పాటు చేయాలనుకున్న స్థలంలో ప్రేమ్‌నగర్ గ్రామం ఉంది. గతంలో ఖాళీ చేయాలని చాలా మంది హెచ్చరికలు జారీ చేశారు. మరికొంత మంది నష్టపరిహారంతో పాటు ఇతర చోట స్థలం కేటాయిస్తామని చెప్పారు. ఊరంతా జెండాలతో ప్రహరీ ఏర్పాటు చేశారు. అయినా ఎవరూ వెళ్లలేదు. యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్రం ఆదేశించడంతో ఈ గ్రామం కనుమరుగు కానుంది. ఇక్కడ దశాబ్దాలుగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాల కాలగర్భంలో కలిసిపోనుంది.

విద్య, వైద్య హబ్

ప్రస్తుతం గట్టమ్మ పక్కన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలుర ఇంటర్మీడియట్ కళాశాల వసతి నడుస్తుంది. పైగా.. నాలుగు రోజుల క్రితమే వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రూ.180 కోట్ల వ్యయంతో మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారు. మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో 300 పడకల ఆస్పత్రి నిర్మాణంలో ఉంది. ఇప్పుడు ఇక్కడే గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కాబోతోంది. దీంతో విద్య, వైద్య హబ్‌గా ఈ ప్రాంతం మారనుంది.

సకల దేవతల ఆశీర్వాదం



గట్టమ్మ వద్ద గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రధాని మోదీ ప్రకటన చేయడంతో గట్టమ్మ, సమ్మక్క–సారలమ్మ, సకల దేవతల ఆశీర్వాదం లభించింది. గట్టమ్మ ఆలయం అనతి కాలంలో అభివృద్ధి చెందుతుంది. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పదనే దానికి ఇదే నిదర్శనం.

- డాక్టర్ ప్రహ్లాద్, బీజేపీ నాయకుడు

చాలా సంతోషం..



ములుగు జిల్లాకు గిరిజన యూనివర్సిటీ ప్రకటిస్తూ రూ.900 కోట్లు కేటాయించడం చాలా సంతోషంగా ఉంది. తద్వారా గిరిజన ప్రాంతంలో విద్యపై దృష్టి పెరుగుతుంది. సమాజంలో ఉన్నత వ్యక్తులుగా గిరిపుత్రులు ఎదగడానికి సహకరిస్తుంది. ములుగు అంచలంచెలుగా ఎదుగుతోంది.

- డాక్టర్ సుతారి సతీశ్, విద్యావేత్త

ప్రయత్నం ఫలించింది..



గిరిజన యునివర్సిటీ ఏర్పాటుపై ప్రధాని పూర్తిస్థాయి ప్రకటన చేయడం శుభ పరిణామం. ఎన్నో పోరాటాలతో యూనివర్సిటీని సాధించుకున్నాం. నిధులు విడుదల చేసి తరగతులు ప్రారంభించాలి. ఢిల్లీకి పోయినప్పుడల్లా వర్సిటీ ఏర్పాటుకు మెమోరాండం సమర్పించాం. ప్రయత్నం ఫలించింది.

- ధనసరి సీతక్క, ఎమ్మెల్యే, ములుగు

6న నగరానికి మంత్రి కేటీఆర్ రాక

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- అదేరోజు భారీగా సంక్షేమ బహిరంగ సభ
- వేలాది మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పంపిణీ
- అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేయాలి
- సమీక్ష, సమన్వయ సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



కేటీఆర్ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష, సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

సాక్షిప్రతినిధి, వరంగల్ : హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మంత్రి కె.తారకరామారావు పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ నెల 6న నగరంలో కేటీఆర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అదే రోజు వరంగల్‌లో భారీ సంక్షేమ బహిరంగ సభ నిర్వహిస్తారు. ఆ సభలో వేలాది మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను కేటీఆర్ చేతుల మీదుగా పంపిణీ చేస్తారు. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. హనుమకొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యేలు, అధికారులతో ఆదివారం రాత్రి సన్నాహక, సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 6న మంత్రి కేటీఆర్ హైదరాబాద్ నుంచి నేరుగా చాపర్‌లో నగరానికి రానున్నారని తెలిపారు. అనంతరం పోలీస్ భరోసా కేంద్రం ప్రారంభోత్సవంతో జిల్లా పర్యటన ప్రారంభం కానున్నదని పేర్కొన్నారు. స్మార్ట్‌సిటీ పనులు, డిజిటల్ లైబ్రరీ, ఐటీ టవర్స్, ఆరు జంక్షన్ల ప్రారంభోత్సవాలు, వివిధ రకాల శంకుస్థాపనల ప్రదేశాల్లో అన్ని సిద్ధం చేయాలని, అధికారులు తమకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని చెప్పారు. రూట్ మ్యాప్‌పై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని, లబ్ధిదారులకు ప్రత్యేకంగా సీటింగ్ అరెంజ్‌మెంట్ చేయాలని వివరించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు వారి శాఖల పరిధిలో చేపట్టే పనులను పర్యవేక్షించాలని ఆయన తెలిపారు. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయాలని మంత్రి దయాకర్‌రావు అధికారులను ఆదేశించారు.

కార్యకర్తలను కాపాడుకుంటా : ఎర్రబెల్లి



కొలన్‌పల్లి కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సన్నూరు, కొలన్‌పల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి ఎర్రబెల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. కాంగ్రెస్ కార్యకర్తలు చిన్నపాక రవి, చిన్నపాక చరేష్, చిన్నపాక సురేష్, చెరుపల్లి వెంకన్న, చెరుపల్లి దర్గయ్య, చిన్నపాక శ్రీకాంత్, అనిల్, దయాకర్, మణి, విజయ్, ప్రవీణ్, చెరుపల్లి శ్రీకాంత్, మధు తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. సర్పంచ్ నలమాస సారయ్య, కొమురుమల్లు ఉన్నారు.

రైతుల కోసమే జీవిస్తా : ఎమ్మెల్యే పెద్ది



దుగ్గొండి: రైతులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

దుగ్గొండి : తాను రైతుల కోసమే జీవిస్తానని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. లక్ష్మీపురం రైతు వేదికలో లక్ష్మీపురం, బంధంపల్లి, కేశవాపురం, పొనకల్, బిక్కాజిపల్లి, నాచినపల్లి, తొగర్రాయి గ్రామాలకు చెందిన 2,688 మంది రైతులకు రూ.2.68 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కులను ఆయన ఆదివారం అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే పెద్ది మాట్లాడారు. పంటలు నష్టపోయి పండుగ పూట రైతులు బోరున విలపిస్తుంటే తాను సీఎం కేసీఆర్ దగ్గరకు వెళ్లానని తెలిపారు. పంటలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను చూసి సీఎం కేసీఆర్ కన్నీరు పెట్టుకున్నారని తెలిపారు. దీంతో ఎకరాకు రూ.10 వేల చొప్పున.. నర్సంపేట నియోజకవర్గంలోని 42 వేల మంది రైతులకు రూ.42 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒకచోట కూర్చుని తమ వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేశారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 1000 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల, ఏడీఏ శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్లు రాజేశ్వర్‌రావు, మహిపాల్‌రెడ్డి, ఏట దయాకర్, పాండవుల సురేందర్, బొమ్మగాని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిండు మనస్సుతో ఆశీర్వదించాలి

చెన్నారావుపేట/ నర్సంపేట రూరల్ : సీఎం కేసీఆర్‌ను రైతులు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఉప్పరపల్లి లక్నెపల్లి క్లస్టర్ గ్రామాల పరిధి రైతులకు ఆదివారం పంట నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వర్షాలతో పంటలు దెబ్బతింటే అప్పటి నాయకులు పంటలు పరిశీలించి, ఫొటోకు ఫోజులు ఇచ్చి పత్తాలేకుండా పోయేవారని విమర్శించారు. కానీ, నాటి పరిస్థితులు నేడు లేవన్నారు. రైతుల్లో చిరునవ్వు చూడటమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు.

గ్రామాల్లో 'స్వచ్ఛతా హీ సేవా'



స్వచ్ఛతా హీ సేవా ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే

వర్ధన్నపేట : గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వర్ధన్నపేట పట్టణంలో మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, మునిసిపల్ కమిషనర్ జోనా ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్ వద్ద అంగన్‌వాడీలు, ఆశవర్కర్లు మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే జెండా ఊపి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. వర్ధన్నపేట పట్టణంలో వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, తోటకూరి రాజమణి పాల్గొన్నారు. కట్ర్యాల గ్రామంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, సర్పంచ్ గుజ్జ సంపత్‌రెడ్డి, వర్ధన్నపేట పాఠశాలలో హెచ్‌ఎం సదానందం, ఉపాధ్యాయులు తాటిపాముల రమేష్, ఎన్‌సీసీ కేడెట్ల ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు.

వృద్ధులను ఆదరించాలి



వృద్ధులను సన్మానించిన అదనపు కలెక్టర్

వృద్ధులను ఆదరించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే సూచించారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో వృద్ధులను ఆదివారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులు చిన్న పిల్లలతో సమానమని, వారిని ఆదరించినప్పుడే సంతానానికి సంతృప్తినిస్తుందన్నారు. ఎవరు కూడా వృద్ధులను నిర్లక్ష్యం చేయవద్దని, వృద్ధాశ్రమాలకు పంపి వారిని బాధ పెట్టవద్దని పేర్కొన్నారు. వృద్ధులకు తమ కుటుంబ సభ్యులతో గడిపే అవకాశం ఉంటుందని వివరించారు. తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మునిసిపల్ కమిషనర్ జోనా, మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'అభయహస్తం'పై ఆశలు!

- ఉమ్మడి రాష్ట్రంలో పథకం అమలు
- తెలంగాణలో రద్దు చేసిన సర్కారు
- ప్రీమియం చెల్లించిన మహిళలు 72,581 మంది
- డబ్బులు ఇప్పిస్తామని రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ హామీ



కొనాయమాకులలో మాట్లాడుతున్న సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్ ప్రావీణ్య (ఫైల్)

గీసుకొండ : అభయ హస్తం పథకం కింద పొదుపు సంఘాల మహిళలు చెల్లించిన ప్రీమియం సొమ్ము ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ వస్తుందనే ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2009లో అభయహస్తం పేరుతో బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ తర్వాత ఈ పథకం అమల్లోకి రాగా 2014 జూన్2లో రాష్ట్ర విభజన జరిగింది. అప్పుడు టీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే ఈ పథకం అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. మహిళలు చెల్లించిన ప్రీమియం డబ్బులను వారికి తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చింది. తొమ్మిదేళ్లు అవుతున్నా ప్రీమియం సొమ్ము అందకపోవడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు.

పథకం అమలు ఇలా..

ఈ పథకానికి 15 నుంచి 59 ఏళ్ల లోపువారు అర్హులు. వారంతా ఏటా రూ.385 చొప్పున ప్రీమియం చెల్లించేలా అప్పటి ప్రభుత్వం పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రీమియం చెల్లించిన ప్రతి మహిళకు 60 ఏళ్లు నిండిన తర్వాత జీవించి ఉన్నంత కాలం ప్రతి నెల రూ.500 పింఛన్ వస్తుంది. ఒకవేళ ఆమె చనిపోతే నామినీకి రూ.30 వేలు వచ్చేలా పథకానికి రూపకల్పన చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 72,581 మంది మహిళలు ఆరేళ్లపాటు ప్రీమియం చెల్లించారు. ఆ తర్వాత పథకాన్ని నిలిపివేయడంతో ఏం చేయాలో తోచక ఇబ్బందులు పడుతున్నారు. చెల్లించిన సొమ్ము ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూపులు తప్పడం లేదు. ఇదిలా ఉండగా తాము అధికారంలోకి వస్తే అభయహస్తం పథకాన్ని అమలు చేస్తామంటూ పలు సభలు, సమావేశాల్లో కాంగ్రెస్ నేతలు హామీ ఇస్తున్నారు.

మునుగోడు నియోజకవర్గ సభ్యులకే చెల్లింపు..

ఉప ఎన్నిక సందర్భగా ప్రభుత్వం మునుగోడు నియోజకవర్గానికి చెందిన మహిళా సభ్యుల అభయహస్తం ప్రీమియాన్ని వారి ఖాతాల్లో జమ చేసింది. ఆ నియోజకవర్గానికి చెందిన దాదాపు 14 వేల మందికి ప్రీమియం సొమ్ము అందింది. కాగా, నల్లగొండ జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల వారికి చెల్లించకపోవడం గమనార్హం.

రూరల్‌డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ హామీతో ఆశలు..

రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా పొదుపు సంఘాల పని తీరును తెలుసుకోవడానికి జిల్లాలోని కొనాయమాకుల, మరియపురం గ్రామాలను సెప్టెంబర్ 12న సందర్శించారు. కొనాయమాకులలో అభయహస్తం ప్రీమియం గురించి మహిళా సంఘాలు ఆయన దృష్టికి తేగా నెల రోజుల్లో చెల్లించేలా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో సుల్తానియా హామీతో జిల్లాలోని ప్రీమియం చెల్లించిన మహిళల్లో మళ్లీ ఆశలు చిగురుస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 435 వీఓలు ఉన్నారు. 11,246 స్వయం సహాయక సంఘాల్లో మొత్తం 1,22,647 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 72,581 మంది అభయహస్తం ప్రీమియం చెల్లించారు. వారిలో ఎస్సీలు 13,804, ఎస్టీలు 11,084, బీసీలు 42,715, ఓసీలు 3,855, మైనార్టీలు 1,123 మంది ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

మండలాల వారీగా ప్రీమియం చెల్లించిన మహిళలు

చెన్నారావుపేట	5,742	నెక్కొండ	5,596
దుగ్గొండి	6,797	పర్వతగిరి	5,457
గీసుకొండ	7,591	రాయపర్తి	6,450
ఖానాపురం	3,990	సంగెం	7,871
నల్లబెల్లి	5,558	వర్ధన్నపేట	6,291
నర్సంపేట	1,1238	మొత్తం	72,581

బహుజన వాదమే ప్రత్యామ్నాయం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జగదీశ్వర్

నర్సంపేట : మతోన్మాద నియంతృత్వ పాలనకు బహుజన వాదమే ఏకైక ప్రత్యామ్నాయమని సామాజిక ఉద్యమ నేత డాక్టర్ జగదీశ్వర్ అన్నారు. ఈ మేరకు ఓంకార్ భవన్‌లో బీఎల్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్రస్తుత ఎన్నికలు, బహుజనుల పాత్ర అనే అంశంపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నియోజకవర్గ కన్వీనర్ వంగల రాగసుధ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ దేశంలోని పలు ప్రాంతాల్లో మతోన్మాదం నియంతృత్వం పెచ్చురిల్లిపోతున్నాయని, పాలకులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు ఐక్యం కావాలని అన్నారు. టీపీఎఫ్ జిల్లా బాధ్యుడు జనగాం కుమారస్వామి, బీఎల్‌ఎఫ్ జిల్లా బాధ్యులు నర్ర ప్రతాప్, కుసుంబ బాబురావు, బీసీ సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్, బహుజన ఐక్య వేదిక డివిజన్ బాధ్యులు డాక్టర్ పెండెం భాస్కర్, కొర్ర రమేష్, మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే. జావెద్, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వర్ధన్నపేట : ఇల్లంద ప్రభుత్వ పాఠశాలలో 1975–76 సంవత్సరంలో ఏడో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 47 సంవత్సరాల తర్వాత పాఠశాల ఆవరణలో సమ్మేళనం నిర్వహించి అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. తల్లిదండ్రులను గౌరవించాలని, వృద్ధాప్యంలో ఆదరించాలని వారు సూచించారు. అప్పటి ఉపాధ్యాయులు దేవేందర్‌రావు, బాబురావు, కేశవరెడ్డి, పూర్వ విద్యార్థులు అంజయ్య, నరేందర్‌రెడ్డి, సదానందం, సోమదాసు, వేణుగోపాల్, సలేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సురేష్, చంద్రశేఖర్, రమేష్, సుభద్ర, సరళ, రేవతి, మాధవి, శారద, అరుణ, గురుమూర్తి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

అమరుల సేవలు శ్లాఘనీయం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

హన్మకొండ : విద్యుత్ అమర ఉద్యోగుల సేవలు శ్లాఘనీయమని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. ఆదివారం హనుమకొండ విద్యుత్‌నగర్‌లో రిటైర్డ్ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థలో ఇంజనీర్లుగా పని చేసి మృతి చెందిన అమరుల సంస్మరణ దినాన్ని జరుపుకున్నారు. అమరులైన రిటైర్డ్ విద్యుత్ ఇంజనీర్ల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ అమరులైన ఇంజనీర్లు సంస్థ కోసం ఎంతో పని చేశారన్నారు. వారిని గుర్తు చేసుకోవడానికి ప్రతి ఏటా సంస్మరణ దినాన్ని జరుపుకోవడం ద్వారా వారి సేవలను స్మరించుకున్న వారమవుతామన్నారు. వారి అనుభవాలు మన మదిలో చిరస్థాయిగా ఉంటాయని తెలిపారు. 52 మంది ఇంజనీర్లు మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్.బీమ్ రావు, సభ్యులు సుధాకర్ రెడ్డి, ప్రసాద రాములు, మోహన మురళీ, రామ్మోహన్‌రావు, రామ్‌గోపాల్‌రావు, పి.చంద్రప్రకాష్‌రావు, దామోదర్ రెడ్డి, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

ఐలమ్మ విగ్రహం అపహరణ



విగ్రహం చోరీపై ఆందోళన చేస్తున్న రజక సంఘం నాయకులు

కాజీపేట : కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీ–కేయూ–100 ఫీట్ క్రాస్‌లో ఇటీవల ఆవిష్కరించిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని దుండగులు ఆదివారం తెల్లవారుజామున అపహరించారు. ఈ విషయం తెలుసుకున్న ఐలమ్మ విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ సార్ల రాజు, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విగ్రహం అపహరించిన దుండగులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. కాగా, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం పర్యవేక్షణలో ఇటీవల ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించగా మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ప్రారంభించారు. కాగా, ఐలమ్మ విగ్రహం అపహరించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిద్ధార్థనగర్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించనున్నట్లు రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నార్లగిరి రామలింగం తెలిపారు.

వరంగల్ చాంబర్‌కు ప్రత్యేక గుర్తింపు

- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీకి ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం ఏనుమాముల లోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో జరిగిన చాంబర్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 75 ఏళ్ల క్రితం 1948 సెప్టెంబర్ 28న ఓరుగల్లు గడ్డపై వర్తక సంఘంగా ఆర్యవైశ్య భవనంలో పురుడుపోసుకుని 1967 జూలై 24న చాంబర్ ఆఫ్ కామర్స్‌గా ఆ తర్వాత చాంబర్ ఆఫ్ ఇండస్ట్రీగా మారిందన్నారు. 55 ఏళ్ల క్రితమే సొంత భవనం ఉన్న గొప్ప సంస్థ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అన్నారు. గతంలో ఎక్కకెళ్లినా ఆస్తులు వివరాలు అడిగే వారని, ఇప్పుడు ఎన్ని ఎకరాల భూమి ఉందని అడుగుతున్నారని, ఇదంతా తెలంగాణ రాష్ట్రంతోనే సాధ్యమైందన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు అండగా ఉంటూ 24గంటల కరెంట్, రైతుబంధు, రైతు బీమా లాంటి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ మంచి వ్యాపార కేంద్రంగా ఎదిగిందని, అందుకే ఉమ్మడి వరంగల్ జిల్లాను సీఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. వ్యాపారులు, వినియోగదారులు, కార్మికులు అన్ని అనుబంధ రంగాలతో కలిసి పని చేస్తుంటే అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చాంబర్ కమిటీతో పాటు చెందిన సీనియర్ వ్యాపారులు, వ్యవసాయంలో 80 ఏళ్లు దాటిన రైతులతో పాటు మార్కెట్‌లోని సీనియర్ గుమస్తాలు, కార్మికులను మంత్రి దయాకర్‌రావుతో పాటు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి.. సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం చాంబర్ జూబ్లీ ఉత్సవాల్లో రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు టి.రమేష్‌బాబు, చింతం సదానందం, చాంబర్ మాజీ అధ్యక్షులు కంభంపాటి కుమారస్వామి, కటకం పెంటయ్య, టి.రమేష్‌బాబు, దిడ్డి కుమారస్వామి, చాంబర్ ప్రతినిధులు వేదప్రకాశ్, చంద్రమౌళి, సంపత్, చింతలపల్లి వీరారావు, ఎన్‌రెడ్డి లింగారెడ్డి, సాగర్ల శ్రీనివాస్, రాజుకరానీ, తోట నర్సింహారావు, తోట సంపత్ రావు, మార్కెటింగ్‌శాఖ అధికారులు జెడీఎం మల్లయ్య, డీడీఎం రాజునాయక్, డీఎంవో ప్రసాదరావు, మార్కెట్ కార్యదర్శి రాహుల్ పాల్గొన్నారు.

ఆధునిక పరికరాలతో వ్యవసాయం లాభదాయకం

ఆధునిక పరికరాలతో సాగు చేపడితే వ్యవసాయం మరింత లాభదాయకంగా ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు అన్నారు. ఆది వారం ఏనుమాముల గ్రెయిన్ మార్కెట్‌లో చాంబర్ వజ్రోత్సవాల సందర్భంగా 'మన అగ్రిటెక్' ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధునిక వ్యవసాయ పరికరాల ఎక్స్‌పో ను మంత్రి దయాకర్‌రావు, మండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి.. డ్రోన్ స్ప్రేయర్‌ని ఎగరవేసి మాట్లాడారు. డ్రోన్ స్ప్రేయర్‌తో రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. అనంతరం మన అగ్రిటెక్‌లో నిర్మించిన సెమినార్‌హాల్‌ను ప్రారంభించారు. రైతులకు నూతన వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తూ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న 'మన అగ్రిటెక్' సేవలను, వ్యవస్థాపకుడు పాశికంటి రమేష్‌ను అభినందించారు.

సర్కారు భూమి స్వాహా..!

- రెండెకరాల సొసైటీ స్థలం మాయం
- విలువ రూ.8 కోట్లు
- కబ్జాపై నిలదీసిన రైతులు



కబ్జాకు గురైన సొసైటీ స్థలం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లోని సర్కారు భూమి కబ్జాకు గురైంది. అయినా కోఆపరేటివ్, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. వంగపహాడ్‌లోని సర్వే నంబర్ 516లో మూడేళ్ల క్రితం రెండెకరాల స్థలాన్ని సొసైటీకి కేటాయించారు. ఈ స్థలంలో సొసైటీ భవనంతో పాటు గోదాం నిర్మాణం ప్రతిపాదనలు కూడా పంపారు. ఈ భూమి యాదాద్రి–ఆరెపల్లి జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. ప్రస్తుతం ఈ భూమి విలువ సుమారు రూ. 8 కోట్లు ఉంది. అయితే పాత భవనం పక్కనే అందుబాటులో ఉన్న స్థలంలో గోదాం నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.24.25 లక్షలతో పనులు చేపడుతున్నారు.

ఖాళీగా ఉండడంతో పాగా..

సొసైటీకి కేటాయించిన రెండెకరాల భూమి ఖాళీగా ఉండడంతో ఓ పార్టీకి చెందిన స్థానిక నాయకుడు పాగా వేశారు. ఈ వ్యవహారంలో కొందరు స్థానిక నాయకులు సహకరించినట్లు రైతులు ఆరోపించారు. భూమిని దర్జాగా కబ్జా చేసి అందులో ఓ గది నిర్మించాడు.

కబ్జాను నిలదీసిన రైతులు

రెండు రోజుల క్రితం జరిగిన వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభలో సొసైటీ భూమి కబ్జాపై రైతులు ప్రశ్న లేవనెత్తారు. విలువైన భూమి కబ్జాకు గురవుతున్నా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పాలక వర్గం సభ్యుల హస్తం ఉందా అంటూ నిలదీశారు. అక్రమ నిర్మాణానికి ఇంటి నంబర్ కోసం ప్రయత్నిస్తున్నట్లు రైతులు తెలిపారు. అయితే భూమి కబ్జా అయినట్లు సొసైటీ చైర్మన్ రాజేష్ అంగీకరించారు. త్వరలోనే సొసైటీకి కేటాయించిన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు.

లాభసాటి వ్యాపారం ఎంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దయాకర్. పక్కన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

- వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్

దామెర: దళితబంధు లబ్ధిదారులు లాభసాటి వ్యాపారం ఎంచుకోవాలని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని ఏఎన్ఆర్ గార్డెన్స్‌లో దళితబంధుపై లబ్ధిదారులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వ్యాపారంలో మెళకువలు పాటించినప్పుడే లాభాలు సాధించగలమని అన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా దళితుల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయం తీసుకొని దళితబంధు ప్రవేశపెట్టారని వివరించారు. వ్యవసాయం, ట్రాన్స్‌పోర్టు, ఉత్పాదక, రిటైల్, సేవారంగం, ఫ్రాంచైజ్ వంటి రంగాల్లో వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనాలోచిత నిర్ణయాలు తీసుకోకుండా వ్యాపారంలో రాణించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 1100 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. రెండో విడతలో ఎంపిక కాని వారు నిరుత్సాహ పడకూడదని, మరో విడతలో ఎంపిక చేస్తామని వెల్లడించారు. మొదటి విడత లబ్ధిదారులు ఇప్పటికే వ్యాపారాల్లో రాణించడం ఆనందంగా ఉందని అన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఏడీ సురేష్, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, దళితబంధు మండల చైర్మన్లు గరిగె కృష్ణమూర్తి, సోదా రామకృష్ణ, మొగిలి, కోడెపాక కరుణాకర్, సుధాకర్, కోట ప్రమోద్, శంకర్, పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత, ఎంపీపీలు కాగితాల శంకర్, అనసూయ, సుమలత, జెడ్పీటీసీలు పోలీసు ధర్మారావు, గరిగె కల్పన, రాధిక, చిలువేరు మొగిలి, సుదర్శన్ రెడ్డి, సుమలత, ఎంపీడీఓలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

అమ్మమ్మ ఇంటికి వచ్చి అనంతలోకాలకు..

- ప్రాణం తీసిన ఈత సరదా
- ఏటూరునాగారంలో ఘటన



అస్లాం (ఫైల్)

ఏటూరునాగారం : సెలవుల్లో సరదాగా గడుపుదామని తన అమ్మమ్మ ఇంటికి వచ్చిన ఓ చిన్నారి.. అనంతలోకాలకు చేరాడు. ఈ ఘటన ఆదివారం ములుగు జిల్లా ఏటూరునాగారం లోని 9వ వార్డులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన దివంగత బషీర్ కుమార్తె సుల్తాన, ఆమె భర్త ఖయ్యూం భూపాలపల్లిలో కూలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. సుల్తాన తల్లి గ్రామమైన ఏటూరునాగారం రావడంతో అస్లాం తన స్నేహితులతో కలిసి ఆదివారం సరదాగా సమీపంలోని జంపన్న వాగులోకి ఈత కొట్టేందుకు వెళ్లాడు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగు వరద ఉధృతి పెరిగింది. ఇది గమనించని అస్లాం నీటిలో దిగి ఈత కొడుతుండగా ఒకేసారి లోతులోకి కొట్టుకుపోయాడు. గమనించిన స్నేహితులు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకొని వెతుకగా గ్రామశివారులో అస్లాం మృతదేహం లభ్యమైంది.

నా కొడుకును వాగు మింగింది..

సుల్తాన, ఖయ్యూం దంపతులకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. రెండో కుమారుడు అస్లాం భూపాలపల్లిలోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. జంపన్నవాగు నా కొడుకును మింగింది అని కన్నీరుమున్నీరుగా తల్లిదండ్రులు విలపించారు. అమ్మమ్మ ఇంటికి వచ్చి కానరాని లోకాలకు పోతివా అంటు గుండెలవిసేలా రోదించారు. మృతుడి మేనమామ షఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు .

వాట్సాప్ కాల్!

- పక్కా ప్రణాళికతోనే రాజు హత్య?
- పోలీసుల అదుపులో మరో ఇద్దరు
- మృతదేహంకోసం గాలింపు

హసన్‌పర్తి: బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ తుమ్మల రాజు మృతిపై కొత్తకోణం వెలుగు చూసింది. ఫోన్‌కాల్ చేస్తే దొరికిపోతామని, వాట్సాప్ కాల్‌చేసి రప్పించి హత్యచేసినట్లు ప్రచారం జరుగుతోంది. పక్కా ప్రణాళికతోనే హత్య జరిగినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

వేధింపులే హత్యకు దారి తీసింది..

బాల్య స్నేహితురాలిని వేధింపులకు గురి చేయడమే హత్యకు దారితీసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ యువతిని వేధింపులకు గురి చేయడం, ఈ విషయం ఆ కుటుంబాల్లో గొడవకు దారి తీసినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని ఆ యువతి తన తల్లిదండ్రులకు వివరించినట్లు తెలిసింది. ఈ విషయమై తల్లిదండ్రులు రాజును హతమార్చాలని నిర్ణయించి పథకం పన్నినట్లు సమాచారం. దీనికి నర్సంపేటలో ఉన్న ఆ యువతి మామ సహకారం కోరినట్లు తెలిసింది. శనివారం వాట్సాప్ కాల్ అందడంతో రాజు మద్యం సేవించి బైక్‌పై ఆ యువతి ఇంటికి చేరుకున్నాడు. దీంతో పథకం ప్రకారం రాజుపై దాడి చేసినట్లు తెలిసింది. స్పృహ తప్పిపోవడంతో కాళ్లు, చేతులు తాడుతో కట్టి ఆటోలో ఎక్కించుకుని జయగిరి సమీపంలోని ఎస్సారెస్పీలో పడేసినట్లు సమాచారం.

ముందు తండ్రి.. తర్వాత మరో ఇద్దరు..

రాజును ఎస్సారెస్పీలో పడేసిన అనంతరం యువతి తండ్రి నేరుగా వచ్చి హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. ఆ తర్వాత అదే రోజురాత్రి మరో ఇద్దరు కూడా నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారని సమాచారం. వాట్సాప్ కాల్ ఎవరూ చేశారు? హత్యకు ఎప్పటి నుంచి పథకం రచిస్తున్నారు? ఈ హత్యలో మరెవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

మృతదేహం కోసం గాలింపు..

కాగా, ఆదివారం కూడా రాజు మృతదేహం కోసం గాలింపు చేపట్టారు. మూడు బృందాలుగా ఏర్పడి మృతదేహం కోసం గాలిస్తున్నారు. ముందస్తు ఎస్సారెస్పీ నీటి విడుదలను నిలిపివేశారు.

విష జ్వరంతో చిన్నారి మృతి



అక్షర(ఫైల్)

మంగపేట: మండలంలోని కమలాపురం ఒడిశా కాలనీకి చెందిన మరియమ్మ, అజయ్ దంపతుల కుమార్తె బోయ అక్షర(03) విషజ్వరంతో మృతి చెందింది. తల్లిదండ్రుల కథనం ప్రకారం.. అక్షర నాలుగు రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. దీంతో శనివారం ఏటూరునాగారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి మెరుగైన వైద్యం కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఒక్కగాని ఒక్క కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కాగా, సరైన సమయానికి వైద్యం అందకపోవడంతో చిన్నారి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలో అంతర్గత రోడ్లు, ఖాళీ ప్రదేశాలు పారిశుద్ధ్యం పేరుకుపోవడంతో దోమలకు అవాసాలుగా మారాయి. దోమల కారణంగా గ్రామంలో ప్రజలు జ్వరాల బారిన పడి సరైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఇప్పటికైనా డీఎంహెచ్ఓ స్పందించి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా జీపీ అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

డెంగీతో మహిళ..



హరిణి(ఫైల్)

దుగ్గొండి: డెంగీతో ఓ మహిళ మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం మండలంలోని వెంకటాపురంలో జరిగింది. గ్రామానికి చెందిన కడివెండి హరిణి(23)కి 15 రోజుల క్రితం జ్వరం వచ్చింది. నాలుగు రోజుల పాటు వరంగల్‌లో చికిత్స పొంది అనంతరం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలికి భర్త, కూతురు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతున్న అంగన్ వాడీ టీచర్ ..



రజని(ఫైల్)

ములుగు రూరల్ : అనారోగ్యంతో అస్వస్థతకు గురైన ఓ అంగన్ వాడీ టీచర్..చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా సెక్టార్ కీమా తండాలో జరిగింది. కీమ తండా అంగన్ వాడీ టీచర్ రజిని (39) శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెలో పాల్గొన్నారు. సాయంత్రం ఇంటికి వెళ్లిన అనంతరం అస్వస్థతకు గురయ్యారు. దీంతో గ్రామంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. కాగా, అంగన్ వాడీ టీచర్ రజిని మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.

హనుమాన్ తండాలో రైతు..

జఫర్‌గఢ్: మండలంలోని తీగారం గ్రామ శివారు హనుమాన్‌తండాకు చెందిన రైతు బానోతు బాష (50) అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్సై వెంకటనారాయణ కథనం ప్రకారం భాష తన 16 గుంటలతో పాటు మరో కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మూడు సంవత్సరాల నుంచి పంట దిగుబడులు సరిగా రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. దీనికి తోడు కూతురు వివాహం చేశాడు. దీంతో రూ. 7 లక్షల వరకు అప్పు కావడంతో ఎలా తీర్చాలో తెలియక కొద్ది రోజుల నుంచి మనస్తాపానికి గురవుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 23వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటనారాయణ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రగాయాలపాలైన ద్విచక్రవాహనదారుడు

రామన్నపేట : వరంగల్ బట్టల బజార్‌లోని మణికంఠ హోటల్ ఎదుట ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎంజీఎం నుంచి బట్టల బజార్ వైపునకు వస్తున్న ఆటో.. బట్టల బజార్ నుంచి ఎంజీఎం వైపునకు వెళ్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటో బోల్తాపడడంతో పాటు ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

మడికొండలో వృద్ధుడికి..

మడికొండ : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు తీవ్రంగా, ఓ మహిళ స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి మడికొండ చౌరస్తాలో జరిగింది. మడికొండ గ్రామానికి చెందిన బైరి రాజాల్ పని నిమిత్తం ద్విచక్రవాహనంపై తన కూతురు రజినితో కలిసి కాజీపేట వెళ్లారు. అనంతరం మడికొండకు వస్తున్న క్రమంలో చౌరస్తా వద్ద కాజీపేట నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. దీంతో రాజాల్‌కు తీవ్రగాయాలు కాగా, రజిని స్వల్పంగా గాయపడ్డారు. క్షతగ్రాతులను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



సురేష్ (ఫైల్)

చెన్నారావుపేట: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోడ మాణిక్యం తండాలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం తండాకు చెందిన బోడ సురేష్ (32)కు ఎకరంన్నర వ్యవసాయ భూమి ఉంది. అందులో పత్తి పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం పత్తి పంటకు నీరు పారించడానికి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. వ్యవసాయ బావి వద్ద మోటార్‌కు ఉన్న సర్వీస్ తీగలు ఫెయిలై ఉన్నాయి. ఇది గమనించని సురేష్.. ఆ తీగలకు తాకడంతో విద్యుత్ సరఫరా అయి అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ఒక కూతురు ఉంది. సురేష్ మృతితో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

శంషాబాద్ విమానాశ్రయానికి ఆర్టీసీ బస్సు



హన్మకొండ : హైదరాబాద్ శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ విమానాశ్రయానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత తెలిపారు. ప్రయాణికుల కోరిక మేరకు భూపాలపల్లి నుంచి హనుమకొండ మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సు భూపాలపల్లి నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి హనుమకొండకు 06.30 గంటలకు చేరుకుంటుందని, హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి శంషాబాద్ విమానాశ్రయానికి 10:25కు చేరుకుంటుందని వివరించారు. చార్జీ భూపాలపల్లి నుంచి రూ.640, హనుమకొండ నుంచి 530 నిర్ణయించినట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో బస్సు శంషాబాద్‌లో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి సాయంత్రం 6.05 గంటలకు భూపాలపల్లికి చేరుకుంటుందని వివరించారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్చకులు గౌరవప్రదంగా విధులు నిర్వర్తించాలి

- వరంగల్ జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత
- డీడీఎన్ అర్చకులకు పునశ్చరణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ఏసీ సునీత

హన్మకొండ కల్చరల్ : డీడీఎన్ అర్చకులు ఆలయాల్లో ఆగమ శాస్త్రానుసారం దేవాదాయశాఖ నిబంధనల మేరకు క్రమశిక్షణ, ఆరాధనాభావంతో గౌరవప్రదంగా విధులు నిర్వర్తించాలి.. ఎవరైనా ఆగమ విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని దేవాదాయ, ధర్మాదాయశాఖ వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత అన్నారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధూప దీపనైవేద్య(డీడీఎన్) అర్చకులకు మూడు రోజుల పునశ్చరణ తరగతులు ఆదివారం హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామల సునీతతోపాటు రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయ పరిశీలకులు బాబుశంకర్, ఇన్‌స్పెక్టర్లు కవిత, సంజీవరెడ్డి, అనిల్, శృంగేరి సంస్థానం పురాణపండితులు వంగల సోమయాజులు, సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి తనుగుల రత్నాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ 21 కులాల అర్చక వ్యవస్థను కాపాడడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, అందుకు అనుగుణంగా డీడీఎన్ అర్చకులు శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రజలను ఆకర్షించే విధంగా ఆరాధన కార్యక్రమాలు చేయాలని సూచించారు. వేదపండితులు సంపత్‌కుమార్ శర్మ, శ్రీనివాసశర్మ, రవీందర్‌శర్మ, మఠం భువనేశ్వర్, సంతోష్ స్వామి, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్య



మహేష్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన కొల్లూరి మహేష్(44) ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం గ్రామానికి చెందిన మహేష్ ఫర్టిలైజర్‌షాపు నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మహేష్ తండ్రి శ్రీనివాస్‌కు కొద్ది రోజులుగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఇటీవల హాస్పిటల్‌లో చూపించగా కేన్సర్ వ్యాధి ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పరిస్థితి సీరియస్‌గా ఉందని వైద్యులు తెలుపడంతో మహేష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం గ్రామంలోని తన ఫర్టిలైజర్‌షాపులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి సోదరుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి మరో వ్యక్తి..

తొర్రూరు: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి.. బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం డివిజన్ కేంద్రంలో జరిగింది. ఎస్సై జగదీష్ కథనం ప్రకారం మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన ఎండీ బషీర్ (45) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా, మూడున్నర ఏళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన బషీర్.. పట్టణ శివారు వెంకటాపురం రోడ్డులోని ఓ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.